
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జయజయహే.. మహిషాసుర మర్దిని




జమ్మలమడుగులో మహిషాసుర మర్దినిగా వాసవీమాత




లలితా పంచాయతన దేవాలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

కడప వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో..



ప్రొద్దుటూరు శివాలయంలో..



కడప విజయదుర్గ దేవాలయంలో మహాగౌరిగా అమ్మవారు



దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రులలో ముఖ్యమైన దుర్గాష్టమి సందర్భంగా గురువారం జిల్లాలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. దసరా ఉత్సవాలు చివరి దశకు చేరుకోవడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కడప నగరంలోని అమ్మవారిశాల వీధిలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు, ఆకుల వీధిలోని రాజరాజేశ్వరిదేవి మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. బిల్టప్ సమీపాన ఉన్న విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు మహాగౌరీదేవిగా కొలువుదీరారు. జమ్మలమడుగు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, కన్యతీర్థంలోని బాలత్రిపురసుందరీదేవి మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, శివాలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులను కటాక్షించారు. పోరుమామిళ్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద మహిషాసుర మర్దిని వేషాలతో కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

- కడప (కల్చరల్)/ ప్రొద్దుటూరు (టౌన్)



కడపలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ...



పోరుమామిళ్లలో మహిషాసుర మర్దిని ఘట్టం ప్రదర్శిస్తున్న కళాకారులు



కలసపాడు మండలం ఎగువరామాపురంలో సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

సమస్యల పరిష్కారానికే గ్రామోదయం

- ఎగువరామాపురంలో కలెక్టర్ మార్నింగ్ వాక్

కలసపాడు, అక్టోబరు 10: ప్రజాసమస్యల పరిష్కారానికే గ్రామోదయం ఏర్పాటు చేశామని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. గురువారం ఉదయం కలసపాడు మండలంలోని ఎగువరామాపురం పంచాయతీలో జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులతో కలిసి కలెక్టర్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. గ్రామంలోని పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎస్సీకాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండడంతో తక్షణమే వాటిపైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల పరిస్థితి, విద్యార్థులకు బోధనా విధానాలు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శ్మశానాలు, సంపద సృష్టికేంద్రాలను పరిశీలించారు. విద్యుత్ హౌసింగ్, పెన్షన్ పథకాలకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలోని వంక పోరంబోకు భూమిని మహిళా సమాఖ్యలకు లీజుకు ఇచ్చి తద్వారా వచ్చే కౌలు ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారును ఆదేశించారు. అనంతరం సంపద సృష్టి కేంద్రం వద్ద గ్రీన్ అంబాసిడర్లు, అధికారులు, సిబ్బందితో కలిసి అల్పాహారం ఆరగించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, తహశీల్దారు మధురవాణి, సర్పంచ్ వెంకటయ్య, పంచాయతీ సెక్రటరీ సృజనా, వీఆర్వో నాయక్, మెడికల్ ఆఫీసరు శైలజ. సీడీపీఓ లక్ష్మి, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి పట్టుగొమ్మలు గ్రామాలు

- జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

వల్లూరు, అక్టోబరు 10 : దేశ ఆర్థిక పురోభివృద్ధికి గ్రామాలు పట్టుగొమ్మల్లాంటివని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. 'గ్రామోదయం' కార్యక్రమంలో భాగంగా గురువారం వల్లూరులో మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులుతో కలిసి ఆమె అన్ని వీధులు తిరుగుతూ స్థానికుల సామాజిక ఆర్థిక స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడున్న గర్భవతులు, బాలింతలుకు సంబంధించి అంగన్వాడీ కేంద్రంలో ఇస్తున్న పోషకాహారాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎస్‌డబ్ల్యుపీసీ సెంటరులో అధికారులతో సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పరిశీలించిన అంశాలు వారి దృష్టికి తెచ్చారు. తాను తిరిగి వచ్చేటప్పుడు ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. జేసీ వెంట మండల ప్రత్యేక అధికారి క్రిష్ణకిశోర్, తహశీల్దారు శ్రీవాణి, ఎంపీడీవో రఘురామ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుమలత, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్వో ,అంగన్వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. వీరితో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులతో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

ప్రజల భద్రతే లక్ష్యం

- గువ్వలచెరువు ఘాట్‌లో..
- ప్రమాదాల నివారణకు చర్యలు : జేటీసీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేటీసీ క్రిష్ణవేణి

సీకేదిన్నె, అక్టోబరు 10: రహదారుల్లో ప్రయాణం చేసే ప్రజల భద్రతే లక్ష్యమని.. వారు క్షేమంగా గమ్యస్థానాలకు చేరేందుకు రవాణా శాఖ తమ వంతు కృషి చేస్తోందని జేటీసీ క్రిష్ణవేణి తెలిపారు. స్థానిక ఉప రవాణా శాఖ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల భద్రత, ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని రవాణా శాఖ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోందన్నారు. నిరంతరం రవాణా శాఖ సిబ్బంది పర్యవేక్షణ ద్వారా ప్రమాదాలు నివారించడంతో పాటు రవాణా శాఖకు ఆదాయ మార్గాలు కూడా పెరుగుతాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపేవారు, లైసెన్సు లేకుండా, ఎటువంటి ఆధారాలు లేని వాహనాలు నడిపేవారిని పట్టుకుని చలానాల రూపంలో రవాణా శాఖకు ఆదాయం పెంచుకుంటున్నామన్నారు. దసరా సెలవుల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన వాహనాలు నడిపి ప్రయాణాలు సజావుగా సాగేలా చూస్తామన్నారు.

గువ్వల చెరువు ఘాట్‌లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. గువ్వల చెరువు ఘాట్‌కు రెండువైపుల 'స్టాప్ వాష్ అండ్ గో' విధానాన్ని అమలు పరచి డ్రైవర్లు నిద్ర మత్తులో లేకుండా అప్రమత్తం చేస్తామన్నారు. అందుకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం నుంచి తీసుకుని అక్కడ ఏర్పాట్లు చేస్తామన్నారు. అదే విధంగా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని రాత్రిపూట హోంగార్డులతో షిఫ్ట్ పద్ధతిలో పర్యవేక్షణ చేసేందుకు కృషి చేస్తామన్నారు. దీంతో గువ్వలచెరువు ఘాట్‌లో ప్రమాదాలు తగ్గుతాయన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాలను ఆపి ఒకేసారి ఒకదానివెంట ఒకటి 20కిపైగా వాహనాలు వెళ్లే విధంగా చర్యలు చేపడతామన్నారు. ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని నేరుగా రవాణాశాఖ అధికారులను కానీ, కార్యాలయాన్ని సందర్శించి తమ పనులు పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సేవించే వారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా



తనిఖీ చేస్తున్న ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐ

కడప (క్రైం), అక్టోబరు 10 : గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కడప నగరంలో గంజాయి సేవించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. మరో వైపు జిల్లాలోని పలు కొరియర్ కార్యాలయాలు, గోడౌన్లలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని ఏడురోడ్ల సర్కిల్‌లో ఉన్న కొరియర్ కార్యాలయాలు, గోడౌన్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో డీఎన్‌సీసీ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యంషాపులకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు

- వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

కడప (క్రైం), అక్టోబరు 10: నూతన మద్యంపాలసీలో భాగంగా మద్యంషాపులకు నిర్వహిస్తున్న లైసెన్సు టెండర్ల కోసం ఎవరైనా నిరభ్యంతరంగా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకున్నవారి వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ అన్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థి వివరాలు బయటకు తెలియవని, జిల్లాలో ఎక్కడినుంచైనా దరఖాస్తు చేసుకునే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ కడప జిల్లాకు 139 మద్యంషాపులకు 2,225, అన్నమయ్య జిల్లాలో 111 షాపులకు 1,392 దరఖాస్తులు ఇప్పటి వరకు వచ్చాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 1500 వరకు దరఖాస్తులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు సమయాన్ని ప్రభుత్వం పొడిగించిందన్నారు. 14న కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ ద్వారా షాపులకు ఎంపికలు నిర్వహించి 16 నుంచి మద్యంషాపులను అందుబాటులోకి తెస్తామన్నారు. సిండికేట్లను అనుమతించమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈ ఎస్ వినోద్‌కుమార్‌నాయక్, టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.



నూతన మద్యం పాలసీ, దుకాణాల టెండర్ల ప్రక్రియపై మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

కొండలు తవ్వేస్తున్నారు

- భారీ యంత్రాలతో తవ్వకాలు
- టిప్పర్లలో తరలించి విక్రయం
- పట్టించుకోని అధికారులు
- మామూళ్లకోసమే వదిలేస్తున్నారని ఆరోపణలు

మోట్నుతలపల్లెలో అక్రమంగా కొండను తవ్వి టిప్పర్లలో మట్టిని తరలిస్తున్న దృశ్యం



అధికారం అండగా గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చెలరేగిపోయారు. వాగు వంక అన్న తేడా లేకుండా ఎర్రమట్టిని కొల్లగొట్టారు. వైసీపీ అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం కొలువుతీరినా మార్పు రాలేదు. మట్టి మాఫియా ఆగడాలు కొనసాగుతున్నాయి. పులివెందులకు ఆనుకుని పట్టపగలే కొండలను పిండిచేస్తున్నారు. ప్రభుత్వానికి పైసా సుంకం చెల్లించడంలేదు. అనుమతులు తీసుకోవడంలేదు. అక్రమార్కులు మైనింగ్ ఇతరశాఖల అధికారులతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వేస్తున్నారు. వెలమవారిపల్లెలో పగలు రాత్రి అన్న తేడా లేకుండా యంత్రాలతో కొండను తవ్వి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. వరుసగా వస్తున్న టిప్పర్లను చూసి ఏమబ్బా ఇక్కడ ఫ్యాక్టరీ కడుతున్నారా అని రైతులు అనుకుంటున్నారు.



వెలమవారిపల్లెలో మట్టిని ఎక్సకవేటరుతో తోడుతున్న దృశ్యం



మట్టి తోలడంతో ఏర్పడిన గుంతలు

పులివెందుల టౌన్, అక్టోబరు 10: పులివెందుల మండలం వెలమవారిపల్లె, మోట్నూతలపల్లె, కనంపల్లె కొండలను మట్టిమాఫియా తవ్వేస్తోంది. మట్టి తవ్వడమే కాకుండా కొండలు గుట్టలు కబ్జా చేస్తున్నారు. అడ్డుకోవలసిన అధికారులు మీనవేషాలు లెక్కిస్తున్నారు. పులివెందులకు చెందిన మట్టిమాఫయా అధికార పార్టీ నాయకులను, ప్రజాప్రతినిధులను అడ్డుపెట్టుకుని కొండలను ఎక్సకవేటర్లతో తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు అక్కడే ర్యాంప్ ఏర్పాటు చేసుకుని మరీ గ్రావెల్‌ను టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ వ్యాపారులకు, రైతులకు గ్రావెల్‌ను టిప్పరుకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు విక్రయిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోక పోగా అక్రమార్కులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా వెలమవారిపల్లె, మోట్నుతులపల్లె గ్రామస్తులు కొందరు కొండపైకి గొర్రెలను తోలుకుని మేతకు వెళుతుంటే వారిని కూడా బెదిరిస్తున్నారు. గ్రావెల్‌ను ఎందుకు తవ్వుతున్నారని స్థానికులు ప్రశ్నిస్తే, తమకు అనుమతులు ఉన్నాయని, కొందరు అధికార పార్టీ పెద్దల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని వారంటున్నారు. పచ్చని కొండలు తవ్వి పశువులకు గడ్డి లేకండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణానికి కూతవేటు దూరంలో దందా జరుగుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. భారీ ఎత్తున టిప్పర్లు రాత్రివేళల్లో దర్జాగా కొండ గ్రావెల్‌ను తరలిస్తున్నా అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రైతులకు బెదిరింపు

కొండలను తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తున్న మాఫియా ఆ ప్రాంత రైతులను బెదిరిస్తున్నారు. కొండలను తవ్వడానికి ఎవరు అనుమతి ఇచ్చారని స్థానిక రైతులు అడిగితే రెవెన్యూ, మైనింగ్ అధికారులు అనుమతినిచ్చారని చెబుతున్నారు. ఇక్కడి టీడీపీ నాయకులతో మాట్లాడుకున్నాం, మీకెందుకు మీ పని చూసుకోండని బెదిరిస్తున్నారని తెలిసింది. మైనింగ్‌శాఖ నుంచి తాత్కాలిక అనుమతి తీసుకుని పర్మినెంటుగా దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. పోలీసులు మండలంలో వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేస్తున్నారే కానీ మట్టి తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

పులివెందుల మండల పరిధిలో వెలమవారిపల్లె, మోట్నూతలపల్లె, కనంపల్లె తదితర గ్రామాల పరిధిలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై పరిశీలించి ఎవరైనా అక్రమంగా మట్టి తరలిస్తున్నట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని బయటికి తరలించినా, రాత్రి సమయాల్లో టిప్పర్ల ద్వారా మట్టి తరలించినా వాహనాలు సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానా వేస్తాం.

- తహసీల్దారు నజీర్‌అహ్మద్

వైవీయూ రిజిస్ట్రారును తొలగించాలి: ఎస్ఎఫ్ఐ

కడప (ఎర్రముక్కపల్లె), అక్టోబరు 10: వైవీయూలో లైంగిక ఆరోపణలు నిజమని కమిటీ ధ్రువీకరించిన రిజిస్ట్రారు రాంప్రసాద్‌రెడ్డిని వెంటనే తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.

సింహాద్రిపురం తహసీల్దార్‌గా నాగేశ్వర్‌రావు


బాధ్యతలు చేపట్టిన నాగేశ్వర్‌రావు

సింహాద్రిపురం, అక్టోబరు 10: సింహాద్రిపురం తహసీల్దార్‌గా జి.వి నాగేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడప కలెక్టరేట్‌లో ఫైనాన్సియల్ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించేవారు. బదిలీపై సింహాద్రిపురం వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సిబ్బంది, ప్రజల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు


సీకేదిన్నె, అక్టోబరు 10: రోడ్డు ప్రమాదంలో ఐచర్ డ్రైవర్‌కు గాయాలైనట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు కడప నుంచి గాలివీడుకు పాలు తీసుకెళుతున్న వ్యాను మద్దిమడుగు బిడికి వద్ద ఓ షాపులో పాలు నింపేందుకు ఆపగా వెనుకవైపు రాజమండ్రి నుండి టమోటా లోడుతో మదనపల్లెకు వస్తున్న ఐచర్ వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాద తీవ్రతను గుర్తించిన బెంగుళూరు నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అప్రమత్తమై బస్సును పొలాల్లోకి దించడం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో ఐచర్ డ్రైవర్ సత్యనారాయణ కాళ్లకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి హర్షణీయం'

కడప (కల్చరల్), అక్టోబరు 10: రాష్ట్రంలోని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగేలా రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి జీఓ జారీ చేయడం హర్షణీయమని పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళీశర్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యనారాయణశర్మ,వారణాసి శ్రీధర్‌శర్మ పేర్కొన్నారు. ఇది తమ సమాఖ్య విజయం అన్నారు.గురువారం బ్రాహ్మణవీధి సమాఖ్య జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.ప్రతి ఆలయాలలో ఆగమ విధానం గాడి తప్పిందన్నారు. దేవుడి అర్చన విషయంలో కూడా అధికారులు, ట్రస్ట్ బోర్డు మెంబర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఉన్న ప్రధానార్చకుల మాటకు గొప్పలకు పోయిందన్నారు.







గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టండి

● ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



చెన్నూరు: ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కిరణ్... కమలాపురం: దేవరాజుపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

కమలాపురం రూరల్, అక్టోబరు 10 : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి తెలిపారు. గురువారం గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేతో కలిసి మండల ప్రత్యేక అధికారి వెంకటసుబ్బారెడ్డి దేవరాజుపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక సదుపాయాలు, ప్రజల జీవన విధానంపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అందుకు అవసరమైన నిధులు కూడా ఇస్తుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుధ్యం, తాగునీరు, సీసీరోడ్లు, వీధి లైట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు.కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా సాగుతోందన్నారు. సంపద సృష్టి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈఓపీఆర్‌డీ కెజియా, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు సుబ్బమ్మ, పంచాయతీ సెక్రటరీ గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామోదయం

చెన్నూరు, అక్టోబరు 10: అన్ని గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, ప్రజల ఆర్థిక స్థితిని తెలుసుకునేందుకు గ్రామోదయం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు తెలిపారు. చెన్నూరులోని తూర్పుదళితవాడ, శివాలయం వీధి అంగన్వాడీ, సచివాలయాల్లో గురువారం మండల అధికారులతో ట్రాక్‌వాక్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంత ప్రజలతో, అంగన్వాడీ కేంద్రాల ఆయాలు, సిబ్బంది, చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. రోడ్ల పనులు పూర్తిచేయాలని, అంగన్వాడీ సమస్యలు తీర్చాలని, నిధులు విడుదల చేయాలని పలువురు కోరారు. అలాగే ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించి అక్కడి పారిశుధ్య సిబ్బందితో మాట్లాడారు. ప్రతి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, ఈఓఆర్‌డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఏపీఓ శైలజ, ఇంజనీరింగ్ అధికారులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



తొండూరు: ఇనగలూరులో మాట్లాడుతున్న సుభాషిణి...లింగాల: బోనాలలో సమస్యలు తెలుసుకుంటున్న మురళీమోహన్

తొండూరు: మండలంలోని ఇనగలూరు గ్రామం దళితవాడలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానశాఖ ఉపసంచాలకులు సుభాషిణి గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర సమస్యలపై ఆరాతీశారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్ అండ్ ఆర్డీ సాయిప్రతాప్‌రెడ్డి, ఏపీఎం రామచంద్రుడు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతటా ఒకే అభివృద్ధి కనిపించాలి

గ్రామీణ ప్రాంతంలో అన్నింటా అభివృద్ధి ఒకే విధంగా కనిపించాలన్నదే గ్రామోదయం ఉద్దేశ్యమని మండల అధికారులు పేర్కొన్నారు.యర్రబల్లె దళితవాడలో గ్రామోదయం నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని బోనాల గ్రామం దళితవాడలో గురువారం మండల స్పెషలాఫీసర్ మురళిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామోదయం నిర్వహించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్యం, రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు తదితర సమస్యలపై ఆరాతీశారు. నమోదు చేసుకున్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ మనోహర్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోండి

కడప(కలెక్టరేట్), అక్టోబరు 10: జ్వరాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అబ్జర్వర్ కొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర అబ్జర్వర్ రిమ్స్ మైక్రో బయోలజీ డాక్టర్ నాగలతను డెంగీ జ్వరాల తీవ్రతపై చర్చించారు. అలాగే ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం ఒంటిమిట్ట పీహెచ్‌సీ ల్యాబ్‌లను తనిఖీ చేసి ల్యాబ్ టెక్నీషియన్‌కు తగు సూచనలు, సలహాలు చేశారు.

అమ్మకానికి సిద్ధంగా పొద్దుతిరుగుడు విత్తనాలు

సీకేదిన్నె, అక్టోబరు 10: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాలలో ఎన్‌డీఎస్‌హెచ్ 1012 (ప్రభాస్) అనే రకం పొద్దుతిరుగుడు హైబ్రిడ్ విత్తనాలు 21 క్వింటాళ్లు, ఐఎస్ఎఫ్ 764 కుసుమ రకం విత్తనాలు 16 క్వింటాళ్లు రైతులకు అమ్మేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఎం.జాన్సన్ తెలిపారు. కేజీ పొద్దుతిరుగుడు విత్తనాలు రూ.500, కుసుమలు రూ.110గా అమ్మబడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తనాలు కావాల్సినవారు 9989625208, 9966665434, 8142263221 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసే వరకు పోరు

కడప (మారుతీనగర్), అక్టోబరు 10: కడప జిల్లాలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటుచేసే వరకు పోరు సాగిస్తామని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బీరం సుభాష్ చంద్రారెడ్డి, పి.వి. సుందరరామరాజు పేర్కొన్నారు. ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ అధ్యక్షతన గురువారం స్థానిక ఐఎంఏ హాలులో జరిగిన పార్టీ కార్యక్రమ సభలో ప్రొద్దుటూరుకు చెందిన ఒంటెద్దు ప్రదీప్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హరూన్ బజాజ్ మహా ఎక్స్ఛేంజ్ మేళాకు భారీ స్పందన


కస్టమరుకు తాళాలు అందిస్తున్న హరూన్ బజాజ్ జనరల్ మేనేజరు పరమేశ్వర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), అక్టోబరు 10 : కడప నగరం ప్రముఖ వ్యాపార సంస్థ హరూన్ బజాజ్ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా షోరూముల వద్ద ఏర్పాటు చేసిన మహాఎక్స్ఛేంజ్ మేళాకు మంచి స్పందన లభించిందని మేనేజింగ్ పార్టనర్ ఎస్‌బీ అహ్మద్‌బాషా తెలిపారు. ఈ మేళాలో ప్రతి బజాజ్ వాహన కొనుగోలుపై రూ.16వేలు డిస్కౌంటు కలదన్నారు. స్పాట్ ఎక్స్ఛేంజ్, స్పాట్ డెలివరీ, స్పాట్ ఫైనాన్స్ కలదన్నారు. ప్రతి వాహన కొనుగోలుపై ఎక్స్ఛేంజ్‌లో రూ.3వేలు అదనంగా ఇస్తున్నామని దానితో పాటు రూ10వేలు క్యాష్ డిస్కౌంటు కలదన్నారు. తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 600 వెహికల్స్ సేల్ అయ్యాయని, 150 బండ్లు బుకింగ్ అయ్యాయన్నారు. బజాజ్ సీఎండీ బైక్స్ , బజాజ్ చేతక్ వాహనాలకు మంచి స్పందన ఉందని జనరల్ మేనేజరు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ ఆఫర్ దసరా ఉత్సవాలకు మాత్రమే ఇస్తున్నామని, ప్రతి కస్టమర్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్


శిశు సంరక్షణ సంస్థలోని చిన్నారిని పరిశీలిస్తున్న జడ్జి

కడప(రూరల్), అక్టోబరు 10 : ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం రిమ్స్ ఆవరణంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అన్ని సంపదల కన్నా ఆరోగ్య సంపద గొప్పదన్నారు. ఆరోగ్యం చెడిపోతే సమస్త సమస్యలకు కారణమవుతుందన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహనను పెంచుకోవాలన్నారు. అనంతరం నగరంలోని బృందా హోల్డేజ్ హోం, చౌడమ్మ హోల్డేజ్ హోమ్, మా అమ్మ ఒడి, శక్తి సదన్, శిశుసంరక్షణ సంస్థలను జడ్జి బాబా ఫక్రుద్దీన్ విజిట్‌చేశారు.

గ్రామోదయం, నగరోదయం సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కడప(కలెక్టరేట్), అక్టోబరు 10: గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాల్లో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. గురుఎవాంరం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి అధికారులతో కలెక్టర్ వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో విజయవంతం చేసినప్పుడే గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాలు ఏర్పడతాయన్నారు. అనంతరం జేసీ అదితిసింగ్ మాట్లాడారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, జడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, తదితర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతూ పాపాఘ్నిలోకి

కమలాపురం రూరల్, అక్టోబరు 10 : గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వ నుంచి నీటిని విడుదల చేసిన 24 గంటల్లోనే పరవళ్లు తొక్కుతూ గంగమ్మ తల్లి పాపాఘ్నిలోకి ప్రవహిస్తోంది బుధవారం జీఎన్ఎస్ఎస్ కాల్వ నుండి పాపాఘ్నినదికి జిల్లా కలెక్టరు లోతేటి శివశంకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి హారతి ఇస్తూ నీరు విడుదల చేశారు. దాదాపు నిన్నటి నుండి 40 కి.మీ ప్రవహించిన సంగమేశ్వర ఆలయం వద్ద పాపాఘ్ని నదిలోకి చేరుకున్నాయి. కమలాపురం పాపాఘ్ని నదిలోకి నీరు ప్రవహించి నేటపల్లె వరకు ప్రవహిస్తుంది. శుక్రవారం నాటికి రైల్వే బ్రిడ్జి వరకు ప్రవహిస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు.

పెన్షన్ భిక్ష కాదు.. మన హక్కు: సీఐటీయూ

కడప (నాగరాజుపేట), అక్టోబరు 10 : పెన్షన్ భిక్ష కాదు.. మన హక్కు అని, ఈపీఎఫ్ పెన్షనర్లకు రూ.9వేలు పెన్షన్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసుల రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

'అక్రమ బదిలీలు రద్దు చేయాలి'

కడప (ఎర్రముక్కపల్లె), అక్టోబరు 10 : ఇంటర్మీడియట్‌లో జరిగిన అక్రమ బదిలీలను రద్దు చేయాలని పీఎస్‌హైఎఫ్ రాష్ట్ర కన్వీనరు కె.ఓబులేసు, టీఆర్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు జయరాజ్, ఆర్ఎస్ఏ రాష్ట్రఅధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. తాడేపల్లి ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జేఏసీ నాయకులు జగదీశ్, రియాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'కులాల వారీగా బీసీల జనగణన చేపట్టాలి

కడప (మారుతీనగర్), అక్టోబరు 10: కులాల వారీగా బీసీ కులగణనన చేపట్టాలని తెలుగుదేశం పార్టీ పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు మాసా కోదండరామ్ కోరారు. గురువారం విజయవాడ సెక్రటేరియట్‌లో బి.సి. సంక్షేమశాఖా మంత్రి సవితమ్మను ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేసిన ఎమ్మెల్యే

వీరపునాయునిపల్లె, అక్టోబరు 10: వీరపునాయునిపల్లెకు చెందిన దేవత శోభారాణి రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరగడంతో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 1,79,668 చెక్కును అందించారు. ఈ విషయాన్ని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు.

జయహే మహిషాసురమర్దిని

కడప (కల్చరల్), అక్టోబరు 10: దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఇంటిల్లిపాది ఆ తల్లిసేవలో తరించారు. కడప విజయదుర్గాదేవి ఆలయంలో 8వ రోజైన గురువారం అమ్మవారు మహాగౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి తెల్లవారుజామున 4.30గంటలకు 72 విశేష కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి షోడపచారాలతో పూజలు నిర్వహించారు. యాగశాలలో చండీహోమం, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. సాయంత్రం 4.00 గంటలకు 18 రకాల పుష్పాలతో పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం 6.00 గంటలకు మహాగౌరీదేవిగా అమ్మవారు పూజలు అందుకున్నారు. అమ్మవారికి మహామంగళహారతులు, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. రాత్రి 8.00 గంటలకు విజయదుర్గామల్లిఖార్జునుల ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు సుధామల్లిఖార్జున రావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.


కడప: బాలపోలేరమ్మ ఆలయంలో సంతానలక్ష్మిగా అమ్మవారు


చెన్నూరులో మహిషాసుమర్దిని అలంకారంలో చౌడేశ్వరిదేవి అమ్మవారు


కడప: విజయదుర్గ ఆలయంలో అమ్మవారి అలంకరణ వద్ద భక్తులు


బాలాజీ ఆలయంలో ధాన్యలక్ష్మీదేవిగా..



భద్రావతి భావనారుషి ఆలయంలో మహిషాసుర మర్దినీదేవిగా..


సీకేదిన్నెలో దుర్గాదేవి అలంకరణలో గంగమ్మతల్లి


కడప నడివీధి గంగమ్మ తల్లి ఆలయంలో సంతానలక్ష్మిగా...


వీరపునాయునిపల్లెలో దుర్గాదేవి అలంకరణలో గంగమ్మ తల్లి


పులివెందుల అంకాలమ్మ ఆలయంలో మహిషాసురమర్దినీదేవిగా...


ఎర్రముక్కపల్లె మారెమ్మ ఆలయంలో కాళీమాతగా...


సింహాద్రిపురంలో మహిషాసురమర్దిని అలంకరణ


వేంపల్లె ఓం శాంతి భవన్‌లో కొలువైన పార్వతీదేవి


కమలాపురం: అమ్మవారిశాలలో మహిషాసురమర్దిని అలంకారం

నీళ్లున్నా.. కన్నీళ్లే...!

- దాహార్తి తీర్చని మంచినీటి పథకం
- అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపం


వెలిగల్లు ప్రాజెక్టులో పుష్కలంగా ఉన్న నీళ్లు

గాలివీడు, అక్టోబరు 10: అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉండటమంటే ఇదేనేమో. వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్ల పుష్కలంగా ఉన్నా ప్రజలకు నీటి కష్టాలు మాత్రం తప్పడం లేదు. తరాలు మారుతున్నా ప్రజల తలరాతలు మాత్రం మారడం లేదు. ప్రజలకు ఆశ చూపి అధికారంలోకి వచ్చిన అప్పటి వైసీపీ ప్రభుత్వం మంచినీటి సమస్యను తీర్చడంలో పూర్తిగా విఫలమైంది. వీటికి తోడు అప్పటి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. అధికారుల తప్పిదంతో ఉన్న నీటి పథకం ప్రజలకు దాహం తీర్చలేని స్థితిలో ఉంది. వివరాల్లోకి వెళితే... ఎక్కడో 33 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాయచోటి పట్టణానికి వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా నీరు అందించిన అప్పటి ప్రభుత్వ పెద్దలు కనీసం మండలంలోని కొన్ని గ్రామాలకు కూడా పూర్తి స్థాయిలో నీటిని అందించలేకపోయారు. వారి నిర్లక్ష్యం వల్ల మండల వ్యాప్తంగా మంచినీటి సమస్య ఉంది.

పేరంపల్లె వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి పథకం పంప్‌హౌస్



దాహం తీర్చలేని మంచినీటి పథకం

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నూలివీడు వరకు కోటి 50 లక్షల రూపాయలతో పైపులైన్ ద్వారా నీరు అందించే మంచినీటి పథకం పూర్తయింది. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ పథకం మంచినీటి సమస్యను తీర్చడంలో పూర్తిగా విఫలమైందని ప్రజలు చెబుతున్నారు. ఈ మంచి నీటి పథకం ద్వారా పేరంపల్లె, గుండ్లచెరువు, నూలివీడు పంచాయతీలోని 40 పల్లెలకు నీరు అందించడానికి ఏర్పాటు చేశారు.

ఈ గ్రామాలకు నీరు అందించడానికి పేరంపల్లె వద్ద పంపుహౌస్‌ను కూడా నిర్మించారు. అయితే ఈ గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్న పైపులైన్ 140 ఎంఎం ఉండడం వల్ల అందులో వచ్చే నీరు కనీసం ఒక గ్రామానికి కూడా సరిపోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పై మూడు పంచాయతీల్లోని 40 పల్లెల్లో 70 వేలకు పైగా జనాభా కలరు. సాధారణంగా (ఆర్‌డబ్ల్యుఎస్) అధికారుల అభిప్రాయం ప్రకారం ఒక వ్యక్తికి రోజుకు 40 లీటర్లు అవసరమవుతాయి. ఈ లెక్కన 7 వేల మంది ప్రజలకు రోజుకు 2 లక్షల 80 వేల లీటర్లు నీళ్ల అవసరమవుతాయి. కానీ ఈ పథకం ద్వారా (పైపులైను ద్వారా) కనీసం సగం కూడా నీళ్ల సరఫరా కాలేదు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ముందు చూపు లేకపోవడం వల్ల ఈ మంచినీటి పథకం పరివాహక పల్లెల్లో కూడా నీటి సమస్య ఏర్పడింది. నూలివీడు, గుండ్లచెరువు, పేరంపల్లె పంచాయతీల్లో ఎంత మంది జనాభా కలరు. ఎన్ని మూగ జీవాలు ఉన్నాయి.

రాబోయే 10, 20 సంవత్సరాల కాలంలో ఇంకెంత మంది జనాభా పెరగవచ్చు అనే ముందు చూపు లేకుండా మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. తద్వారా ఈ పథకం ఉన్నా మంచినీటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన పైపులైను స్థానంలో ఇంకా పెద్దది అంటే 15 ఇంచులు ఉండే లైను వేసి ఉంటే ప్రజలకు పుష్కలంగా నీరు అందేది అని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న పైపులైన్‌ను తొలగించి మరో పైపులైను ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వానికి ఎంత నష్టమో. ఈ విషయం అప్పటి అధికారులకు తెలియదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ఇప్పటికీ ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు.

విద్యుత్ కొరత వల్ల నీటిని అందించలేకపోతున్నాం

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఐదు ఇంచుల పైపులైన్ ద్వారా పేరంపల్లె నుంచి నూలివీడు వరకు ప్రస్తుతం మెయిన్ రోడ్లకు దగ్గరలోని పల్లెలు మంచినీటిని అందిస్తున్నాము. కానీ ప్రస్తుతం పగలు 5 గంటలు, రాత్రి రెండు గంటలు విద్యుత్ సరఫరా అవుతున్నది. అందువల్ల పూర్తి స్థాయిలో ప్రజలు నీటిని అందించలేకపోతున్నాము. కానీ ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నాము. అవసరమైతే మరిన్ని ట్యాంకర్లు పెంచడానికి సిద్ధంగా ఉన్నాము.

- క్రిష్ణయ్య, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్, గాలివీడు

పైపులైను ఉన్నా లేనట్లే



వెలిగల్లు ప్రాజెక్టు నుంచి పేరంపల్లె, గుండ్లచెరువు, నూలివీడుకు మంచినీటిని అందిస్తున్న పైపులైను మంచినీటి పథకం ఉన్నా లేనట్లే. ఈ పథకం ద్వారా వేయబడిన పైపులైనులు చాలా తక్కువ. ఇందులో నుంచి మంచినీరు ప్రజలకు ఏ కోశాన చాలడం లేదు. పైపులైను వేయక ముందు ఎలాంటి నీటి కష్టాలను ఎదుర్కొంటున్నాము. ప్రస్తుతం కూడా అలాంటి నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ముందుచూపుతో వ్యవహరించి మంచి నీటి సమస్యను పరిష్కరించాలి.

-వేల్పుల జనార్ధన్, కొండ్రెడ్డిగారిపల్లె, నూలివీడు

జాతీయ తైక్వాండో పోటీలకు పూజిత


బంగారు పతకంతో పూజిత

రైల్వేకోడూరు, అక్టోబరు 10: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు రైల్వేకోడూరుకు ప్రభుత్వ హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న జె.పూజిత ఎంపికైనట్లు ఆర్‌ఎస్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్ హస్తి రవిశంకర్‌రాజు తెలిపారు. 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలికల విభాగంలో పూజిత బంగారు పతకాన్ని సాధించడంతో నవంబరులో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదీస్ ప్రాంతంలో నిర్వహించే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

కుక్క కాటుకు మహిళ మృతి

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు 10: మండలంలోని బుడుగుంటపల్లె పంచాయతీలోని వికాస్‌నగర్‌లో ఉంటున్న మునిలక్ష్మి (35) కుక్కకాటుతో మృతి చెందింది. మునిలక్ష్మి కొంత కాలంగా కుక్కను పెంచుకుంటోంది. ఇటీవల కుక్క కరవడంతో ఆసుపత్రికి వెళ్లకుండా ఇంట్లోనే వైద్యం చేసుకుంది. వారం రోజుల క్రితం పరిస్థితి విషమించడంతో బంధువులు తిరుపతికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

రైలుకింద పడి యువకుడు మృతి


నవీన్ (ఫైల్)

అట్లూరు, అక్టోబరు 10: వేమలూరు ఎస్సీ కాలనీ వాసి నడివీధి నవీన్ (20) కనుమలోపల్లె సమీపంలో బుధవారం రాత్రి రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు నిర్ధారించారని మృతుడి బంధువులు తెలిపారు. బంధువుల వివరాల మేరకు.. మృతుడు నవీన్ జేబులో లవ్ లెటరు ఉన్నట్లు గమనించారని, ఆ లెటరు పోలీసులు తీసుకోవడం చూశామన్నారు. మృతుడికి తల్లి ఈశ్వరమ్మ, ముగ్గురు అక్కాచెల్లెల్లు ఉన్నారు. బుధవారం మృతుడికి పోస్టుమార్టం నిర్వహించి శవాన్ని అప్పగించగా గురువారం సొంత గ్రామంలో అంత్యక్రియలు జరిపినట్లు బంధువులు తెలిపారు. చేతికందివచ్చిన కుమారుడు చనిపోవడంతో కన్నీరుమున్నీరయ్యారు.

విద్యుత్ తీగలు తగిలి పశువు మృతి


మృతి చెందిన బర్రె

బి.కోడూరు, అక్టోబరు 10: తువ్వపల్లె వాసి పత్తిపాటి చిన్నగురయ్యకు చెందిన బర్రె 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మేత కోసం బయటికి తోలడంతో పొలాల్లో మేస్తున్న బర్రెకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో బర్రె మృతి చెందిందని రైతు చిన్నగురయ్య వాపోయాడు. రూ.60 వేల చేసే బర్రె మృతి చెందిందని, అధికారులు స్పందించి ఆదుకోవాలని వాపోయాడు.

కడప రవీంద్రనగర్‌లో చోరీ

- నాలుగు తులాల బంగారు, అర కిలో వెండి అపహరణ

కడప (క్రైం), అక్టోబరు 10: కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి వస్తువులు అపహరించినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. వారి వివరాలకు మేరకు... రవీంద్రనగర్‌కు చెందిన శ్రీనివాసులు ఈనెల 8వ తేదీ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. తిరిగి గురువారం కడపకు చేరుకుని ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు నగలు, అరకిలో వెండి వస్తువులు దొంగలు అపహరించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో జైలు శిక్ష

గాలివీడు, అక్టోబరు 10: వరకట్నం వేధింపుల కేసులో ఒక వ్యక్తి ఆరు నెలలు జైలు శిక్ష, ఐదు వేలు రూపాయలు జరిమానా విధిస్తూ లక్కిరెడ్డిపల్లె జ్యూడిషిల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఫైజున్నీషా తీర్పు ఇచ్చినట్లు సీఐ టీవీ కొండారెడ్డి తెలిపారు. సీఐ కథనం మేరకు.. నూలివీడుకు చెందిన అవలకుంట శశికళ అనే యువతి ఫిర్యాదు మేరకు ఆమె భర్త దేరంగుల రామకృష్ణ మరో ఇద్దరిపై 2018 మే 20న గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన లక్కిరెడ్డిపల్లె జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో ఏపీపీ ఆకుల సుధారాణి, పోలీసుల కృషి, సహకారం వల్ల నిందితులకు శిక్ష పడిందని తెలిపారు. శిక్ష పడిన రామకృష్ణను సబ్‌జైలుకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

పథకాలను రైతులకు చేరవేయాలి

జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రానాయక్

రైల్వేకోడూరు, అక్టోబరు 10: వ్యవసాయ శాఖలో ఉన్న పథకాలను రైతులకు చేరవేసే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు మండల సభా భవనంలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ మొదలవుతున్నందున రైతులకు వ్యవసాయశాఖ ద్వారా ఏయే పథకాలు ఉన్నాయో తెలియజేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు పండించే పంటలను సిబ్బంది నమోదు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు రైతుల పొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖ ఉప సంచాలకులు కవిత మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అందరూ సిబ్బంది పొలం పిలుస్తోంది కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరాజుపేట ఉద్యాన పరిశోధనాస్థానం శాస్త్రవేత్త సందీప్‌కుమార్ మాట్లాడుతూ అరటి, బొప్పాయి పంటల సాగులో సమస్యలు, వాటికి చేపట్టాల్సిన పద్ధతుల గురించి వివరించారు. వ్యవసాయశాఖ అధికారి సుధాకర్, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం టెక్నికల్ ఏవో మోహన్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ పొందుతున్న అధికారులతో సుధాకర్‌రెడ్డి

కడప రూరల్, అక్టోబరు 10 : ఏపీ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను ఉమ్మడి కడప జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, డీఎల్‌డీఓలు సద్వినియోగం చేసుకోవాలని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ మన్నూరు సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం జడ్పీ కార్యాలయ ఆవరణంలోని డీపీఆర్‌సీ భవనంలో రెండవ విడత శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీల పాత్ర కీలకమన్నారు. ఈ మేరకు వారికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా అమలయ్యే సంక్షేమ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి పల్లెసీమల ప్రగతికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో పూర్వపు డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఆర్‌సీ ఏఓ నాగభూషణం, ఆయా మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు పాల్గొన్నారు.

సిద్దవటం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఆటోను ఢీకొన్న లారీ.. సంఘటనా స్థలంలోనే ఇరువురు మృతి


ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న ఆటో

రాజంపేట, అక్టోబరు 10 : సిద్దవటం మండలంలోని మాధవరం ఎస్కేనగర్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇరువురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా ఆటో డ్రైవర్, మరో చిన్నారి తీవ్రంగా గాయపడగా వారిని రిమ్స్‌కు తరలించినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు తెలిసింది.

ఐదేళ్ల డిగ్రీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

కడప (ఎర్రముక్కపల్లె), అక్టోబరు 10 : వైవీయూ పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ అర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్‌మేటిక్ ఫైన్ ఆర్ట్స్, బీకాం హానర్స్ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంచాలకులు ప్రొఫెసరు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపుల్లో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 12లోపు యూనివర్సిటీలో గల ఏపీజే అబ్దుల్‌కలాం గ్రంథాలయ ప్రాంగణంలోని సంచాలకుల కార్యాలయంలో అన్ని రకాల అర్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు ఎం.శివశంకర్, 89855 97928, రాజేశ్ 9014046537, వెంకటేశ్ 9010014304 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

చిరుత పట్టివేతకు పకడ్బందీ చర్యలు


చెర్లోపల్లెను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

చిట్వేలి, అక్టోబరు 10 : చిరుత పట్టివేతకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం... ఎవరూ భయపడవద్దని చెర్లోపల్లె గ్రామస్థులకు ఫారెస్ట్ రేంజర్ ధీరజ్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు గురువారం కోడూరు సబ్ డీఎఫ్‌వో సుబ్బరాజుతో కలిసి చెర్లోపల్లె ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఉన్న చెర్లోపల్లె పరిసరాల్లో చిరుత సంచరిస్తుండడం, ఒక మేకను చంపి తినడం జరిగిందన్నారు. దీంతో గ్రామస్థులు ఈ విషయాన్ని తమ దృష్టికి తెచ్చారన్నారు. గ్రామ పరిసరాల్లో చిరుతను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రొటెక్షన్ వాచర్‌లు, సిబ్బందితో పహారా పెట్టామని, టపాసులు కూడా పేల్చామన్నారు. అన్ని చర్యలు తీసుకున్నామని, ప్రజలు భయపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో శ్రీనివాసులు, ఎస్‌బీవోలు, ఏబీవోలు పాల్గొన్నారు.

కడప ఏఆర్ అదనపు ఎస్పీగా రమణయ్య

కడప (క్రైం), అక్టోబరు 10 : కడప జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) అదనపు ఎస్పీగా రమణయ్యను బదిలీ చేస్తూ గురువారం పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన తిరుపతి ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. రమణయ్యకు ఏఎస్పీగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న క్రిష్ణారావును ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు

కడప (క్రైం), అక్టోబరు 10 : కడప నగరం దొరల గోరీ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప మోచంపేటకు చెందిన ముక్తియార్, రాయచోటి పట్టణానికి చెందిన కమాలుల్లా, నజీబ్‌జాన్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జయ.. జయహే మహిషాసుర మర్దిని

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 10

'అయి గిరినందిని నందితమేదిని విశ్వవినోదిని నందినుతే.. గిరివరవింధ్య శిరోధిని వాసిని విష్ణువిలాసిని జిష్ణునుతే.. భగవతి హే శితికంఠకుటుంబిని భూరికుటుంబిని భూరికృతే... జయ జయహే మహిషాసుర మర్దిని రమ్యక పర్దిని శైలసుతే' అమ్మవారి ఆలయాల్లో అమ్మవారి భక్తి పాటలు హోరెత్తాయి. ఆలయాల్లో మహిషాసుర మర్దిని అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిస్తూ భక్తుల మనోభీష్టాలను నెరవేరుస్తారని ప్రతీతి. దేవీ శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు (అష్టమి) గురువారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. దసరా ఉత్సవాల్లో రెండో మైసూరును తలపించే ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరిని, అగస్త్యేశ్వరాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారిని మహి షాసుర మర్దినిగా అలంకరించారు. మహిషమును రూపొం దించి అర్ధరాత్రి కూష్మాండ బలి గావించారు. పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో కాళింగ మర్దిని, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని, సత్యనారాయణస్వామి ఆలయంలో దుర్గాదేవి, బొల్లవరంలోని లక్ష్మీ వేంకటేశ్వరాలయాల్లో అలంకారాలు కనువిందు చేశా యి. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ముద్దనూరులో....

ముద్దనూరు అక్టోబరు10: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆయలంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.



అమ్మవారిశాలలో మహిషాసురమర్దిని అలంకారం

మహిషాసురమర్దిని అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

కొండాపురంలో....

కొండాపురం, అక్టోబరు 10: మండలంలోని దత్తాపురం పెద్దమ్మగుడిలో, కొండాపు రం అమ్మవారిశాలలో దుర్గా దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు.

జమ్మలమడుగులో....

జమ్మలమడుగు, అక్టోబరు 10: పట్టణంలో పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, కన్యతీర్థంలోని బాలాత్రిపురసుందరీదేవి మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. నాగులకట్ట చౌడేశ్వరీదేవిని దుర్గాష్టమిగా అలంకరించారు. కన్నెలూరు చౌడేశ్వరీదేవాలయం, గంగమ్మ ఆలయం, బురుజు ఆంజనేయస్వామి ఆలయం, ముద్దనూరు రోడ్డులోని సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

గ్యారేజీ ఆవరణలో

దుర్గాష్టమిని పురస్కరించుకునిజమ్మలమ డుగు గ్యారేజీ ఆవరణలో డిపో మేనేజర్ ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు, విద్యుద్దీపాలంకరణ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణికులు పాల్గొన్నారు. జమ్మలమడుగులోని పలు ఆలయాలను ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సందర్శించారు. పట్టణంలోని ఆలయాలను సందర్శించారు.

ఖాజీపేటలో....

ఖాజీపేట, అక్టోబరు 10: కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ భక్తులకు వసతులు కల్పించింది.

మైదుకూరులో....

మైదుకూరు రూరల్ అక్టోబరు 10: స్థానిక లక్ష్మీమాధవ రాయ స్వామి, పెద్దమ్మతల్లి ఆలయాల్లో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు.

బద్వేలులో....

బద్వేలుటౌన్, అక్టోబరు 10: పట్టణంలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారిశాలలో మహిషాసుర మర్దిని అలంకారం, కోదండరామ స్వామి ఆలయంలో నరసింహ అవతారం, మహాలక్ష్మీదేవి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. వీరభద్రస్వామి ఆలయంలో, కనకదుర్గాదేవి ఆలయంలో వేకువజామునుంచే చండీ హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసింది.

పోరుమామిళ్లలో...

పోరుమామిళ్ల, అక్టోబరు 10: వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మహిషాసు రమర్దిని అ లంకారం చేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి అమ్మవారిశాల వరకు వేషాలు, డప్పులతో ఉత్సాహంగా ఆటపాటలతో అమ్మవారిశాల వరకు వచ్చారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. రాత్రి మహిషాసుర మర్దిని అలంకారం చేశారు.

కాశినాయనలో....

కాశినాయన అక్టోబరు10: నర్సాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.








ప్రొద్దుటూరు చెన్నకేశవ స్వామి ఆలయంలో కాళింగి మర్దిని, సత్యనారాయణ దేవాలయంలో దుర్గాదేవి, మైదుకూరులో దుర్గాదేవి అలంకారాలు - మహిషాసురమర్దిని అలంకారంలో ముద్దనూరు, పోరుమామిళ్ల, ఖాజీపేట అమ్మవారి శాలలో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్ శివశంకర్ లోతేటితో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ అక్టోబరు 10: నియోజకవర్గం అభివృద్ధి కోసం సహకరించాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ అతిది సింగ్‌ను కోరారు. వారితో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు గురించి చర్చించారు. గత ప్రభుత్వంలో రేషన్ షాపుల్లో జరిగిన అవకతవకల గురించి పుట్టా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డీలర్ల సమస్యలను తొలగించి వంద శాతం సరుకులు డీలర్లకు ఇస్తేనే వారు పంపిణీ చేయగలరని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించాని కలెక్టర్‌ను పుట్టా కోరారు.



కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా

పీహెచ్‌సీ సెంటర్లు అభివృద్ధి పరచండి

మంత్రి సత్యకుమార్‌కు విన్నవించిన ముక్తియార్

ప్రొద్దుటూరు అక్టోబరు 10: నియోజక వర్గ పరిధిలో పీహెచ్‌సీ సెంటర్లను అభివృద్ధి పరచాలని, వైద్య అధికారులు సిబ్బంది వుండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్‌ను మాజీ మున్సిపల్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్ కోరారు. విజయవాడలో మంత్రిని కలిసిన ఆయన వినతి పత్రం అందజేశారు. పేదలు ఎక్కువగా జీవిస్తున్న అమృత నగర్‌లో పీహెచ్‌సీలో సరైన వైద్య సేవలు అందుబాటులో లేవని మంత్రి దృష్టికి తెచ్చారు. జిల్లాప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య అధికారులు, సిబ్బందిని నియమించి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడలన్నారు.



మంత్రి సత్యకుమార్‌తో ముక్తియార్

అమరనాథ స్వామి లింగ దర్శనం భాగ్యం : వరద

ప్రొద్దుటూరు, అక్టోబరు 10: దసరా ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక ప్రచారంలో భాగంగా అమరనాథ్‌లోని మంచు లింగ ఆకారాన్ని కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ స్థలంలో బ్రహ్మకుమారిలు ప్రతిష్ఠింప చేశారు. గురువారం రాత్రి అమర్‌నాథ్ స్వామి మంచు లింగ ప్రదర్శనను ప్రారంభించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ సాక్షాత్తు అమర్‌నాదుని దర్శించుకున్నట్టుగా ఈ మంచు లింగం భక్తులకు కనువిందుగొలుపుతోందన్నారు. మున్సిపల్ కమిషనర్ వి మల్లికార్జున, త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి పాల్గొన్నారు.



మంచులింగాన్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి

గ్రామోదయంలో వెల్లువెత్తిన సమస్యలు



ప్రాజెక్టు కాలనీ 2లో అధికారులతో కలిసి పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టరు వెంకటపతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామోదయానికి అధికారులు నడుంబిగించారు. కలెక్టర్ మొదలు గ్రామ స్థాయి అధికారి వరకు గ్రామాలు పరిశీలించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. కలసపాడు మండలంలో గురువారం కలెక్టర్ శివశంకర్ లోతేటి మార్నింగ్ వాక్ నిర్వహించారు. దీంతో అధికారులు గ్రామాల పరిశీలనకు వెళ్లారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా సమస్యలు వెల్లువెత్తాయి. ఇదిలాగే సాగితే ప్రతి గ్రామంలో సైతం ఒక్క సమస్యకూడా మిగలదనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే....

అభివృద్ధే గ్రామోదయం ప్రధాన లక్ష్యం

గోపవరం, అక్టోబరు 10: గ్రామీణాభివృద్ధే గ్రామోదయం ప్రధాన లక్ష్యమని డిప్యూటీ కలెక్టరు వెంకటపతి అన్నారు. గోపవరం మండలం రెండో ప్రాజెక్టు కాలనీలో గ్రామోదయంలో ఆయన ప్రాజెక్టు కాలనీ 2లో ట్రాన్సిక్ వాక్ చేసి ప్రజలతో శానిటేషన్, తాగునీరు తదితర విషయాలపై చర్చించారు. బేతాయపల్లె అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈఓపీఆర్‌డీ షేక్ హసీనా, ఐసీడీఎస్ లక్ష్మిదేవి, తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి, కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, విజయ్‌కుమార్, నిఖిత, మోష, వెంకటసుబ్బయ్య, ఆయా శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తంగేడుపల్లె పంచాయతీలో....

బి.కోడూరు, అక్టోబరు 10: తంగేడుపల్లె పంచాయతీలో సర్పంచ్ గోడి లక్ష్మిదేవి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను మండల స్పెషల్ ఆఫీసరు నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. అధికారులతో కలిసి పంచాయతీ పరిసరాలు పరిశీలించారు. గ్రామోదయంలో భాగంగా అంగన్వాడీ స్కూలు హెల్త్ సెంటరు, సచివాలయ కార్యాలయాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. చెత్తనుంచి సంపద కేంద్రం (ఎస్‌డబ్ల్యుఈసీ) పరిశీలించి వినియోగంలోకి తెచ్చేందుకు గ్రామస్తుల సలహాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు, అగ్రికల్చర్ ఏడీ మురళీధర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు మధునాయక్, పీఆర్ఏఈ నారాయణరెడ్డి, ఏపీఓ రాజా, ఈసీ ఖాజా, వ్యవసాయాధికారి కౌశిక, ఈఓపీఆర్‌డీ బాలక్రిష్ణ, వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు, టీడీపీ నేతలు గోడి రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

భద్రిపల్లె, నెర్రవాడ గ్రామాల్లో...

చాపాడు, అక్టోబరు 10: భద్రిపల్లె, నెర్రవాడ గ్రామాల్లో పలు సమస్యలను గుర్తించినట్లు మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. సర్పంచ్ గుత్తి మల్లేశ్వరి, విజయలక్ష్మి, తహసీల్దారు రమాకుమారి, ఈఓపీఆర్‌డీ క్రిష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుబ్బరత్న, రాజ్యలక్ష్మి, ఏపీఓ జగదీష్‌రెడ్డి, ఏపీఎం శ్రీధర్, టీడీపీ నేత గుత్తి వీరనారాయణ, పలువురు అధికారులు పరిశీలించారు. సంపద తయారీ కేంద్రంలో సేంద్రియ ఎరువులు తయారీపై స్పెషల్ ఆఫీసర్ ఈఓపీఆర్‌డీని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

మైలవరంలో....

మైలవరం, అక్టోబరు 10: ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని ఎంపీడీఓ రామచంద్రారెడ్డి అన్నారు. గ్రామోదయంలో భాగంగా మండల అధికారులు పర్యటించారు. మైలవరంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీరు, వీధిలైట్స్ పారిశుధ్యం, వైద్య సదుపాయాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ, మండల అధికారులు ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, చిదంబర్‌రెడ్డి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



నెరవాడలో మురికి కాల్వను పరిశీలిస్తున్న అధికారులు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసరు నాగేశ్వర్‌రావు

గంగనపల్లెలో...

కాశినాయన అక్టోబరు10: ప్రతి పల్లెను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి నరసింహారెడ్డి పేర్కొన్నారు. గంగనపల్లెలో నిర్వహించిన గ్రామోదయలో గ్రామంలో ఇంటింటా తిరిగి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈలు బాలపుల్లయ్య, బాలిరెడ్డి, సందీప్‌కుమార్ ఎంఈఓ నిర్మల, మండల వైద్యులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పుష్ప పాల్గొన్నారు.

ముద్దనూరులో....

ముద్దనూరు అక్టోబరు10: వార్డుల్లో ప్రజల సమస్యలపై అధికారులు ఆరాతీశారు. గ్రామోదయంలో భాగంగా మండల అధికారులు 4,5 వార్డుల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు, అంగన్వాడీ సమస్యలపై ప్రజలను అడిగితెలుసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి చాముండేశ్వరీ, ఎంపీడీఓ ముకుందారెడ్డి, తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రవికుమార్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజావర్మ పాల్గొన్నారు.

ఎస్.ఉప్పలపాడులో...

జమ్మలమడుగు, అక్టోబరు 10: జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఎస్.ఉప్పలపాడును సందర్శించారు. గ్రామోదయంలో భాగంగా మార్నింగ్ వాక్ నిర్వహించి రేషన్‌షాపును పరిశీలించారు. గ్రామంలో రేషన్ పంపిణీపై వాకబు చేశారు. కందిబేడలు పంపిణీ చేయలేదని గొడౌన్ వద్ద నుంచి తక్కువగా ఇచ్చినందుకు పంపిణీ చేయలేదని అధికారులకు తెలియజేశారు. హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఓబులేసు, నరసింహులు, రెవెన్యూ సిబ్బంది సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రముఖ హేతువాది లవణం జయంతి

ప్రొద్దుటూరు అక్టోబరు 10: భావ వాదంతో భౌతిక వాదం హేతువాదం భాగమని వీటిని అనుసరించటం వలన మానవ జీవితం వైవిధ్య భరితం అవుతుందని భారత నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు పల్లవోలు రమణ పేర్కొన్నారు. స్థానిక సృజనా సామాజిక వేదిక కార్యాలయంలో ప్రముఖ భారతీయ హేతువాద ఉద్యమ నేత గోపరాజు రామచంద్రరావు అలియాస్ లవణం జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో విరసం రాష్ట్ర మాజీ కార్యదర్శి వరలక్ష్మీ, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, రాయలసీమ విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత, సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ నాస్తిక సమాజం సభ్యుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీపై నిరాశ పరచడం తగదు

బద్వేలు, అక్టోబరు10: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను 12వ పీఆర్‌సీ విషయంలో నిరాశపరచడం తగదని ఎస్టీయూ ఏపీ కడప జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ ముఖ్య నేతలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం 12వ పీఆర్‌సీ అమలు చేయడంలో జాప్యం చేస్తోందన్నారు. ఎస్టీయూ ఏపీ రాష్ట్ర కౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్లు వెంకటసుబ్బయ్య, శివారెడ్డి, బద్వేలు పట్టణ అధ్యక్షులు రమేష్‌రాజా, జిల్లా నేతలు చల్లా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసైన్‌మెంటు పట్టాదారులకు భూములు చూపాలి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 10: అసైన్‌మెంటు లబ్ధిదారులకు భూములు సర్వే చేసి చూపాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శివకుమార్ మాట్లాడుతూ 17 ఏళ్ల కిందట అసైన్‌మెంటు కమిటీ ద్వారా పంపిణీ చేసిన పట్టాలకు ఇంత వరకు సర్వే చేసి భూములు చూపలేదన్నారు. లబ్ధిదారులకు దక్కాల్సిన భూములు ఆక్రమణకు గురయ్యాయని, భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కన్నెలవాగు చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

ఖాజీపేట, అక్టోబరు 10: కన్నెలవాగు చెరువును ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ గురువారం సాయంత్రం పరిశీలించారు. తెలుగుగంగ కాల్వ నుంచి సబ్‌కాల్వ ద్వారా కన్నెలవాగు చెరువుకు నీరు ఎత్తారని, కాల్వ రెండుకిలోమీటర్ల దూరం ఉండడంతో చెరువుకు నీరు ఎలా వస్తుందని పరిశీలించారు. కృష్ణాజలాలు చెరువులోకి వస్తున్నాయని, కొద్దిరోజుల్లోనే చెరువు నిండుతుందన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, టీడీపీ నేతలు భాస్కర్‌రెడ్డి, పుల్లయ్యనాయుడు, రాము, మామిళ్ల క్రిష్ణారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, శ్రీనివాసులు, హరినాథరెడ్డి, రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యపై ఆసక్తిని పెంపొందించాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 10: విద్యపట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించాలని మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. గురువారం జేవీవీ కార్యాలయంలో మూడు రోజుల రాష్ట్రస్థాయి యూత్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ సమాజం, కుటుంబం, పాఠశాలలు విద్యార్థుల్లో ఉన్న ఆసక్తిని నాశనం చేస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ సమాజంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, దీనికి పరిష్కారం కనుగొనడానికి యువత చొరవ చూపాలన్నారు. జీవ పరిణామ క్రమంలోని ముఖ్యాంశాలను వివరించారు. జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ నేతలు తవ్వా సురేష్, జిలానీబాషా, వర్మ, రాజశేఖర్, శోభన్, మురళీగుప్త, మహిత, శశికళ, శర్వాణి, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్